క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబుతో సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం రానున్న రోజుల్లో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటిని అందిస్తామన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఎస్టీయూ నాయకులతో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్దిలేటిస్వామి సేవలో ఎమ్మెల్యే కోట్ల

మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించారు.

20 వాహనాలకు జరిమానా

సంజామల: వాహన రికార్డులు, లైసెన్సు లేని 20 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రమేష్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ముదిగేడు గ్రామం వద్ద శనివారం వాహనాల తనిఖీ చేశారు. కోవెలకుంట్ల, అవుకు, తిమ్మినాయినపేట, తాడపత్రికి వెళ్లే వాహనాలను ఆపి లైసెన్స్, ఆర్సీ, రోడ్డు ట్యాక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా రికార్డులు కలిగి ఉండాలని.. లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నిర్మాణాలు పూర్తి కాకుండానే అనుమతులా?



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

డోన్ టౌన్: పట్టణంలో భాష్యం స్కూల్ నిర్వహిస్తున్న భవన నిర్మాణం పూర్తి కాకుండానే జిల్లా అగ్నిమాపక అధికారులు ఏప్రిల్ 30వ తేదీ ఫైర్ సర్టిఫికెట్ ఎలా మంజూరు చేస్తారని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధోని రాజు, కార్యదర్శి మహేశ్వరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం భాష్యం స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భాష్యం స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేకున్నా, మండల విద్యాధికారులు స్కూల్‌ను సీజ్ చేసినా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.

23 నుంచి లారీడ్రైవర్ల సమ్మె

డోన్ టౌన్: ఈనెల 23 తేదీ నుంచి లారీ డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లనున్నట్లు సీఐటీయూ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ డోన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. కర్నూలు కార్మికశాఖ అధికారి, లారీ యజమానుల సంక్షేమ సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికుల మధ్య జరిగిన జాయింట్ మీటింగ్‌లో వేతన ఒప్పందంపై జరిపిన చర్చలు విఫలమైందన్నారు. శనివారం డోన్ కార్యాలయంలో కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. ఇందులో భాగంగా లారీ యజమానులకు సమ్మె నోటీసు పంపుతున్నట్లు తెలిపారు. 23వ తేదీ నుంచి లారీ డ్రైవర్లు, క్లీనర్లు విధులకు హాజరుకాకూడదని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న వాల్మీకి సంఘం నేతలు

అవుకు: పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో బాలికపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి ప్రతినిధి గోపాల్, జిల్లా నాయకుడు గజ్జల పెద్దన్న, దయ్యాల నాగమద్దిలేటి డిమాండ్ చేశారు. శనివారం అవుకు బస్టాండ్ నుంచి మార్కెట్, ఎస్సీ కాలనీ మీదుగా పోలీస్ స్టేషన్‌కు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. నిందితులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ కిరణ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల వాల్మీకి నాయకులు దయ్యాల మహేష్, మస్తాన్, వెంకట రమణయ్య, రాముడు, తలారి మధు, చిన్న మద్దిలేటి, రాముడు, రామచంద్రుడు, నాగసూర్యుడు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ సంఘం సమావేశం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గాయత్రీ పీఠంలో శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అధ్యక్షతన ఆదివారం డోన్ వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 7:30 గంటలకు పీఠంలోని దేవతా మూర్తులకు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.

వర్షాకాలం.. పశువులు భద్రం

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే పశువుల ప్రాణాలకే ప్రమాదం
- 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వైద్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పాడిరైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వెంటనే 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి మరీ చికిత్స అందిస్తారు. పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు సూచనలు.



సంజామల: వానా కాలంలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ సీజన్‌లో వివిధ వ్యాధులు ప్రబలుతుంటాయి. నిర్లక్ష్యం చేస్తే పాల దిగుబడి తగ్గిపోవడంతో పాటు వాటి ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.

గాలికుంటు వ్యాధి : గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలకు ఎక్కువగా సోకుతాయి. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

చిటుకు వ్యాధి : వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వచ్చే వ్యాధుల్లో చిటుకు ఒకటి. ఇది సోకినప్పుడు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూలై, ఆగస్టు మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించడం వల్ల వాటిని నివారించవచ్చు.

గొంతువాపు : పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ కారుతుంది. శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు హెచ్‌ఎస్ టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

ఎద సమయాన్ని గుర్తించాలి

వానా కాలంలో చల్లగా ఉండడం వల్ల ఆడ పశువులు ఎదకు వస్తాయి. శీతల గాలులు ప్రారంభం అవ్వగానే ఎద లక్షణాలు కనిపిస్తాయి. గేదెలో ఎదకాలం 36 గంటలు ఉంటుంది. గేదెలో ఉదయం, సాయంత్రం ఎద కనిపిస్తే మరసటి రోజు ఉదయం, సాయంత్రం చూలు కట్టాలి.

పోషణ

పచ్చిక బయల్లో పెరిగిన గడ్డిన తిన్న పశువులకు తగినంత వేడి అందదు. ఎండు గడ్డి కూడా సుమారు ఐదారు కిలోలు రోజు మేత వేయాలి. నాణ్యమైన దానాన్ని మేతగా ఇవ్వాలి. శుభ్రమైన నీరు 60 నుంచి 70 లీటర్లు, వట్టిపోయిన పశువులకు 40 లీటర్లు తాపాలి.

ఆరోగ్య సంరక్షణ

పశువులు కొట్టాలకు రంధ్రాలు, చీలికలు లేకుండా చూసుకోవాలి. రంధ్రాలు ఉంటే వర్షకాలంలో వర్షపునీరు చేరి పశువుల మేత తడిచిపోతుంది. తేమ వల్ల ఈగలు, దోమలు, పిరుదుల ఎక్కువై పశువుల ఆరోగ్యం దిబ్బతినే ప్రమాదం ఉంటుంది. షెడ్డులో ఈగలు, దోమల నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



పశువుల అనారోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో పశువులకు కాలానుగుణ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు స్థానిక పశు వైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు.

–మోహన్ రావు, పశుసంవర్ధకశాఖ ఏడీ, సంజామల

డోన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని టౌన్–1 ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యు.కొత్తపల్లె సబ్ స్టేషన్‌లోని డిగ్రీ కళాశాల ఫీడర్ కింద రోడ్డు డివైడింగ్ పనుల కారణంగా ప్రభుత్వాస్పత్రి, సాంజో స్కూల్, దొరపల్లె ఫ్యాక్టరీకి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. అలాగే చిన్న మల్కాపురం ఫీడర్ 33 కేవీ లైన్ మరమ్మతు కారణంగా మల్కాపురం, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి 12 గంటల వరకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేట, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల పనుల్లో భాగంగా ఇన్సులేటర్ల మార్పు పనులు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జలదుర్గం గ్రామంలో..

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదుర్గం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

చంద్రబాబు నైజం బయటపడింది



మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికీ రూ.15 వేల చొప్పున చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అంటూ మరోసారి ప్రజలను దగా చేయడానికి సిద్ధమయ్యారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దుయ్యబట్టారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జీఓ 29 జారీ చేసిన ప్రభుత్వం అందులో ప్రతి పిల్లాడికి అని కాకుండా ప్రతి తల్లికి రూ.15వేలు ఇస్తామంటూ పేర్కొనడమే ఇందుకు నిదర్శమన్నారు. ఎన్నికల ముందు ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.15వేలు ఇస్తామంటూ చంద్రబాబు, మొదలు పార్టీ నాయకులు ఊదరగొట్టారని తెలిపారు. అసలు ఈ పథకాన్ని ఎలా అమలు చేయాలనుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎన్నిసార్లు ప్రశ్నించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. మేనిఫెస్టోకు కట్టుబడి ఉండకపోవడం, ఇచ్చిన మాట తప్పడం, పథకాలు అమలు చేయకపోవడం చంద్రబాబుకు అలవాటేనని..తల్లికి వందనం పథకం అమలు విషయంలో కూడా అదే ధోరణి అవలంభిస్తున్నట్లు ఎద్దేవా చేశారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే..

పథకాలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సీనియర్ ఐపీఎస్ అధికారులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అప్పటి ఎంపీ రఘురామ కృష్ణమరాజు ఫిర్యాదులో వాస్తవం లేదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పినా.. ఇప్పుడు మళ్లీ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేవలం రాజకీయ కక్షతోనే ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మంత్రి అండతోనే అరాచకాలు

నియోజకవర్గంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అండతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసం చేస్తూ గ్రామాల్లో అరాచకం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ పద్ధతికి స్వస్తి పలకాలని హితవుపలికారు. అలాగే కొనసాగితే ప్రజలే తిరగబడే రోజులు వస్తాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయని తెలిపారు.

మొహర్రం వేడుకలు షురూ



ఆస్థానంలో కొలువైన హజరత్ అబ్బాస్‌పీర్లు



కొండపేటలోని పెద్దపీరల చావిడిలో కొలువైన హుస్సన్, హుస్సేన్ పీర్లు

బనగానపల్లె రూరల్: మొహర్రం సందర్భంగా బనగానపల్లె పట్టణంలోని పలు చావిడీలలో పీర్లను భక్తి శ్రద్ధలతో కొలువు చేశారు. ఈ పండుగను హిందూ ముస్లింలు ఐకమత్యంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈ నెల 8వ తేదీ నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆస్థానంలో వెలసిన శ్రీహజరత్ అబ్బాస్‌పీర్లు, దొరకోటలోని గంధం పీర్లు, పోలీసు సర్కిల్ కార్యాలయం వద్ద ఇమాంఖాసీం పీర్లు, కొండపేటలోని పెద్ద పీర్ల చావిడీలలో కొలువైన హుస్సన్, హుస్సేన్ పీర్లు, ఖాజీవాడలోని హస్తం పీర్లతో పాటు వివిధ పీర్ల చావిడీల్లో కొలువైన పీర్లకు హిందూ. ముస్లింలు ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఈ నెల 14న చిన్నసరిగెత్తు, 15న మధ్య సరిగెత్తు, 17న పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయి.

సంజామల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో పీర్లను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఫాతేహాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. ఆదివారం చిన్న సరిగెత్తు, సోమవారం మధ్య సరిగెత్తు, 16వ తేదీ పెద్ద సరిగెత్తు, 17వ తేదీ పీర్లు ఏటికి సాగనంపడంతో మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.

నేడు చిన్న సరిగెత్తు వేడుకలు

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్లను కొలువుదీర్చారు. పట్టణంలోని కోటపేట కాలనీలో సయ్యద్ ఇమామ్ కాశీమ్, గౌరిపేటలో బారే ఇమామ్, హుసేన్, బైటిపేటలో మౌలాలీ స్వామి పీర్లను కొలువుంచారు. బేతంచెర్ల, ఆర్ఎస్ రంగాపురం, యంబాయి, సిమెంట్ నగర్ ప్రాంతాల్లో ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేకు పీర్ల చావిడీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్యాపిలి: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం చిన్నసరిగెత్తు పర్వదినాన్ని జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 14 పీర్ల చావిడీలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చిన్నసరిగెత్తు రోజున భక్తులు పీర్ల స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కాగా మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం పీర్లు ఏటికి వెళ్లడంతో వేడుకలు ముగియనున్నాయి.

ముస్తాబైన పీర్ల చావిడీలు

అవుకు: మొహర్రం పండుగలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పీర్ల చావిడీలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అవుకులోని తొమ్మిది పీర్ల చావిడీల్లో పీర్ల దేవుళ్ల కొలువుదీరాయి. ఆదివారం చిన్న సరిగెత్తు, 15వ తేదీ మధ్య సరిగెత్తు, 16వ తేదీ పెద్ద సరిగెత్తు ,17వ తేదీ మొహర్రం (పీర్లు ఏటికి వెళ్లు) పండుగ ఉంటుందని నిర్వహకులు తెలిపారు.



విద్యుద్దీపాలంకరణలో ఖాజా బందేనవాజ్ పీర్ల చావిడి







పట్టణంలోని బారే ఇమాం పీర్ల చావిడీలో కొలువైన గుడిబచ్చాపీర్లు, ఆకుమల్లలో కొలువుదీరిన పీర్లు, బేతంచెర్లలో కొలువుదీరిన సయ్యద్ ఇమామ్ కాశీమ్ పీర్లు

రోడ్డు సౌకర్యం లేక అవస్థలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం నుంచి గ్రామాలకు చేరుకునే కనెక్టివిటీ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో గ్రామీణులు రవాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పని నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. రోడ్డు సౌకర్యం లేక కి.మీ మేర చుట్టూ తిరిగి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొలిమిగుండ్ల నుంచి మీర్జాపురం, సంజామల మండలంలోని రామిరెడ్డిపల్లె, పేరుసోముల వరకు కనెక్టివిటీ రోడ్డు ఉంది. ప్రస్తుతం కొలిమిగుండ్ల నుంచి మీర్జాపురం వరకు మాత్రమే 2017లో తారురోడ్డు నిర్మాణం జరిగింది. మీర్జాపురం నుంచి రామిరెడ్డిపల్లె, పేరుసోముల వరకు రోడ్డు అస్తవ్యస్థంగా ఉంది. కొలిమిగుండ్ల మండలానికి చెందిన లక్ష్మంపల్లె, పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె, కోటపాడు గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర పనుల నిమిత్తం కొలిమిగుండ్లకు రావాలంటే తిమ్మనాయినపేట మీదుగా రావాల్సి ఉంటుంది. పేరుసోముల మీదుగా మీర్జాపురం, కొలిమిగుండ్ల వరకు రోడ్డు నిర్మాణం చేపడితే ఆయా గ్రామాల ప్రజలు పది నిమిషాల్లో చేరుకునే పరిస్థితి ఉంటుంది. రోడ్డు ఏర్పాటైతే రవాణ సౌకర్యాలు మెరుగుపడుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొలిమిగుండ్ల చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గం చాలా అనుకూలంగా ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్నికోట నుంచి కొలిమిగుండ్ల, మీర్జాపురం, రామిరెడ్డిపల్లె మీదుగా పేరుసోముల వరకు రూ.12 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించాలని అధికారులు నివేదికలు పంపారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఈరోడ్డుపై దృష్టి సారిస్తే గ్రామీణులకు సౌకర్యవంతంగా ఉంటుంది.



మీర్జాపురం-రామిరెడ్డిపల్లె రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?



ముదిగేడు-సంజామల రహదారి



సంజామల సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

సంజామల: ముదిగేడు నుంచి మండల కేంద్రం సంజామలకు వెళ్లే 6 కిలోమీటర్ల రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయపడుతున్నారు. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు చేరుతున్నాయి. ఎక్కడ గుంత ఉందో తెలియక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతలను పూడ్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రాయితీతో గడ్డివిత్తనాల పంపిణీ

- పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు నాగరాజు



రైతులకు గ్రాసం విత్తనాలను అందజేస్తున్న పశువైద్యశాఖాధికారులు

డోన్: పశుపోషకులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలను అందిస్తోందని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ నాగరాజు తెలిపారు. డోన్ నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా శుక్రవారం నుంచి జొన్న, మొక్కజొన్న విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. డోన్ మండలానికి జోవార్ వెయ్యి కేజీలు, మైజీ విత్తనాలు 500 కేజీలు సహా మొత్తం 1500 కేజీలు, బేతంచెర్ల మండలానికి జోవార్ 650 కేజీలు, మైజీ 850 కేజీలు, ప్యాపిలి మండలానికి జోవార్ 850 కేజీలు, మైజీ 650 కేజీలు మంజూరైనట్లు వెల్లడించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో విత్తనాలు పొలంలో చల్లుకుంటే రెండు నెలల్లోనే పశుగ్రాసం దిగుబడి మొదలవుతుందని తెలిపారు. 20 సెంట్ల స్థలంలో కేజీ గడ్డి విత్తనాలను చల్లుకునే అవకాశం ఉందన్నారు. 6 నుంచి 7 పశువులకు దాదాపు 6 నెలల పాటు పశుగ్రాస సమస్య ఉండదన్నారు. ఈ పశుగ్రాసంలో అత్యధిక ఖనిజ లవణాలు, మాంస కృతులు పుష్కలంగా ఉండడం వల్ల పశువులకు సమతుల్య ఆహారం లభిస్తుందని తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



ఎర్రగుడి మాధవి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామానికి చెందిన ఎర్రగుడి మాధవి(17) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ శనివారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువతి ఆ తర్వాత తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా అచూకీ తెలియకపోవడంతో మాధవి తల్లి రామలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్నేహితుని చికిత్సకు ఆర్థిక సాయం

బేతంచెర్ల: కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన దుర్గాపేట కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మద్దిలేటికి చిన్ననాటి స్నేహితులు రూ.24 వేల ఆర్థికం సాయం చేసి అండగా నిలిచారు. శనివారం రాత్రి నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మద్దిలేటిని పరామర్శించిన 2004 పూర్వ విద్యార్థులు ఆయనకు ఆర్థిక సాయం అందించారు.

జీవాలకు బ్లూటంగ్ వ్యాక్సినేషన్



జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారిణి

అవుకు: మండల పరిధిలోని గొర్రెల కాపరులు జీవాలకు బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాలని అవుకు పశు వైద్యాధికారిణి భారతీదేవి సూచించారు. శనివారం అవుకు మండలం మన్నేనాయక్ తండాకి వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు. గొర్రెలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవాలు వ్యాధుల బారిన పడకుండా తప్పని సరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. అవుకు, గుండ్లశింగవరం పశువైద్యశాలల్లో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఎల్ఎస్ఏ రాజేష్, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఒడిబియ్యం సమర్పణ



ఒడిబియ్యంతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం అమ్మవారికి మహిళలు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్య మహిళలు స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం నుంచి ఒడి బియ్యాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, మహిళా మండలి అధ్యక్షురాలు వందన, కర్నాటి జ్యోతి పాల్గొన్నారు.

గుహల ఆవరణలో స్వచ్ఛతా కార్యక్రమం

కొలిమిగుండ్ల: ప్రముఖ పర్యాట కేంద్రం బెలుం గుహల ఆవరణలో ఓఎన్‌జీసీ బేస్ క్యాంపు సిబ్బంది శనివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. బెలుం గుహల పరిసరాల్లో పడివున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను తొలగించారు. జియోఫిజికల్, జీపీఎస్ బృందాలతో గుహల ఆవరణలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించినట్లు చీఫ్ జగదీష్ పామర్తి తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుహల యూనిట్ మేనేజర్ అమర్నాథరెడ్డి, ఓఎన్‌జీసీ, బెలుం గుహల సిబ్బంది పాల్గొన్నారు.



బుద్ధ విగ్రహం వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది